క్లుప్తంగా

ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రావికమతం : దేశ వ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి తన ప్రాణాలు అర్పించిన గొప్ప జాతీయవాది డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు గల్లా రాజేశ్వరరావు అన్నారు. మండలంలో గుడ్డిప గ్రామంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖర్జీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో శ్రీనివాస్, ఆదినారాయణ, మాతారావు, మధు పాల్గొన్నారు.

గంజాయి, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న రూరల్ సీఐ రేవతమ్మ

నర్సీపట్నం : గంజాయి, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ పేర్కొన్నారు. నర్సీపట్నం మండలం, యరకన్నపాలెం గ్రామంలో ఆదివారం గంజాయి నియంత్రణ, దుష్ప్రభావాలు, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ గంజాయి పండించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు సమాచారం అందించాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు శక్తి యాప్‌ను రూపొందించామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాజారావు, గ్రామ నాయకులు సుర్ల సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతికి ఘనంగా ఏర్పాట్లు

నర్సీపట్నం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఈ నెల 8న వాడ వాడలా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహానేత భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ సుపరిపాలన అందించి ప్రజల్లో హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నేటికీ మహానేత ప్రజల గుండెల్లో సజీవంగా ఉన్నారని కొనియాడారు. మహానేత జయంతి వేడుకలను నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. వీలైన సేవా కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి: మండలంలోని ములకలాపల్లి, కొత్తపెంట గ్రామాలలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. విద్యుత్ లైన్‌లో మెయింటెనెన్స్ పనులు నిమిత్తం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అచ్చిరాజు మృతికి సంతాపం



అచ్చిరాజు (ఫైల్)

నాతవరం: నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు (అబ్బారావు) (67) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మరణించారు. మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నల పాలెం గ్రామానికి చెందిన అచ్చిరాజు మర్రిపాలెం పంచాయతీ ఉప సర్పంచ్‌గా పాలకేంద్రం అధ్యక్షుడిగా విశాఖ డెయిరీ ట్రస్టుబోర్డు డైరెక్టరుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. అచ్చిరాజు మృతి పట్ల మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్, రజాక్ తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు మాజీ ఎంపీపీ విజయకుమార్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

వితంతు పింఛన్లు ఎప్పుడిస్తారు...



ఎంపీడీవోకి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చీడికాడ : భర్తలను కోల్పోయి ఆర్థిక ఆధారం కోల్పోయిన వితంతువులకు పింఛన్లు ఎప్పుడు అందిస్తారో చెప్పాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఎంపీడీఓ హేమసుందరరావుకు వినతి పత్రం అందించారు.

‘సహకారం’ లేక శిథిలావస్థలో...

- అద్దె భవనాల్లో పీఏసీఎస్‌ల కార్యకలాపాలు
- ఆప్కాబ్ నుంచి రుణ సౌకర్యానికి నిరాకరణ
- పక్కా భవనాలు లేక ఎరువులు, విత్తన విక్రయాలకు అవరోధం

మండలంలో మొత్తం సహకార సంఘాలు	:08
సంఘాలులో సభ్యులు సంఖ్య	:12,500
పక్కా భవనాలు గల సంఘాలు	:4
అద్దె భవనాలులో కొనసాగుతున్న సంఘాలు	:4
నియోజకవర్గ పరిధిలో గల సహకార సంఘాలు సంఖ్య	:8
అద్దె భవనంలో నడుస్తున్న సంఘాలు	:1 చీడికాడ



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎం.కోడూరు పీఏసీఎస్ భవనం



అద్దె భవనంలో కె.జె.పురం పీఏసీఎస్ భవనం



శిథిలావస్థకు చేరిన కె.జె.పురం పీఏసీఎస్ భవనం

మాడుగుల రూరల్ : సహకార రంగంలో నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. మాడుగుల కేంద్ర సహకార బ్రాంచి పరిధిలో 8 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో నాలుగు సంఘాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. నాలుగు సంఘాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. మండలంలో మాడుగుల, ఎం.కోటపాడు, వీరనారాయణం, వీరవల్లి అగ్రహారం, సహకార సంఘాలు పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన నాలుగు భవనాలు శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. లాభాల బాటలో ఉన్న కె.జె.పురం సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం పూర్తిగా తుప్పలు, డొంకలతో నివాసయోగ్యం కాని విధంగా ఉంది. ఈ భవనాన్ని 1971లో నిర్మించారు. తర్వాత వచ్చిన పాలకవర్గాలు సంఘ భవనానికి మరమ్మతులు చేపట్టారు. కాలక్రమేణా శిథిలావస్థకు చేరడంతో భవనం ఖాళీ చేశారు. గ్రామంలో ప్రైవేటు అద్దె భవనంలో సహకార సంఘం కొనసాగుతుంది. సంఘ భవనం నిర్మించాలని గతంలో అప్కాబ్ రుణం కోసం రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. కానీ రుణం మంజూరు చేయలేదు. దీంతో ప్రస్తుత భవనం పక్కన గల ఖాళీ స్థలాన్ని విక్రయించి భవనం నిర్మించాలని ప్రతిపాదించగా, అది కూడా ఆచరణకు నోచుకోలేదు. ఒమ్మలి పీఏసీఎస్‌కు పక్కా భవనం 1981లో నిర్మించారు. ఇది కూడా శిథిలావస్థకు చేరడంతో ఏడాదిన్నర క్రితం అద్దె భవనంలోకి మార్చారు. నెలకు రూ.3వేలు అద్దెతో నడుస్తుంది. పక్కా భవనం నిర్మాణం కోసం ఆప్కాబ్‌కు మూడుసార్లు రుణం కోసం ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదని సంఘ మాజీ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు తెలిపారు. శిథిల భవనాన్ని తొలగించడానికి కూడా అనుమతి రాలేదన్నారు. ఎం.కోడూరు పీఏసీఎస్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల క్రితం భవనాన్ని తొలగించి, అద్దె భవనంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు. పక్కా భవనం నిర్మాణం కోసం ఆప్కాబ్‌కు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపించినా రుణం మంజూరు కాలేదని సంఘ మాజీ అధ్యక్షుడు అప్పలనాయుడు తెలిపారు.

మండలంలో అతి పెద్ద సహకార సంఘం అయిన కింతలి పీఏసీఎస్ భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో పూర్తిగా తొలగించారు. అద్దె భవనంలో నడుస్తుంది. పక్కా భవనం నిర్మించాలని ఆప్కాబ్‌కు రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. రుణం మంజూరు కాలేదు. సంఘాలకు పక్కా భవనాలు లేకపోవడంతో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులను విక్రయించలేక పోతున్నారు. దీంతో సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కలగడం లేదు. రైతులు ప్రైవేటు వర్తకులు వద్ద అధిక ధరలు చెల్లించి, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో గల మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె. కోటపాడు, మండలాల్లో 16 సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉండగా, వీటిలో 11 సంఘాలకు పక్కా భవనాలు ఉన్నాయి, మరో 5 సంఘాలు అద్దె భవనంలో నడుస్తున్నాయి.

ప్రభుత్వం చేయూత అందించాలి



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, వాటి మనుగడకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. రైతులకు వ్యవసాయ పెట్టుబడులకు చేదోడుగా ఉన్న సంఘాలకు ఆర్థిక చేయూత నివ్వాలి. ఆప్కాబ్ రుణాలు కూడా మంజూరు కాకపోవడంతో పక్కా భవనాలు నిర్మించక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం స్పందించాలి.

– పదాల అప్పలనాయుడు, ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు

పక్కా భవనం నిర్మించాలి



సహకార సంఘాలు ఆర్థికంగా బలపడడానికి, రైతులకు పరపతి సౌకర్యంతో పాటు సంఘాలకు పూర్తి స్థాయిలో పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలి. కె.జె.పురం సహకార సంఘానికి చెందిన స్థలాన్ని అధికారుల అనుమతితో విక్రయించి, పక్కా భవనం నిర్మించాలి.

–మద్దాల వెంకట సత్యనారాయణ, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు, కె.జె.పురం

సంఘాలకు ఆర్థిక భారం



పలు నిబంధనల పేరుతో ఆప్కాబ్, సహకార సంఘాలు పక్కా భవనాలకు రుణాలు మంజూరు చేయడంలేదు. గతంలో భవనాలకు ఆప్కాబ్ రుణం మంజూరు చేయగా ప్రతి ఏటా సంఘాల నుంచి రుణాన్ని తిరిగి చెల్లించే వారు. నేడు రుణాలు ఇవ్వకపోవడం వల్ల భవనాలకు నిలువనీడ లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో అద్దె వ్యయం పెరుగుతోంది.

– పి. సత్యనారాయణ, రైతు, కె.జె.పురం

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చింనాయుడు

బుచ్చెయ్యపేట : చిన అప్పనపాలెం గ్రామంలో మంగళవారం జరిగే వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశానికి అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు కోరారు. బుచ్చెయ్యపేటలో ఆదివారం వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు చిన అప్పనపాలెం గ్రామంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు మామిడి తోటలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తెనుగుపూడిలో వైఎస్సార్ జయంతి వేడుకలు రేపు

దేవరాపల్లి: దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను తెనుగుపూడిలో మంగళవారం భారీ స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. తెనుగుపూడిలో ఉదయం 9 గంటలకు జరిగే మహానేత జయంతి వేడుకల్లో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు. మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, జయంతి కేక్‌ను కట్ చేస్తారన్నారు. అనంతరం దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

పార్టీ కోసం పనిచేయండి...వెన్నుదన్నుగా ఉంటా

- మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్
- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించిన అమర్‌నాథ్

రోలుగుంట : పార్టీ కోసం శ్రమించే వారికి వారు ఏ కష్టంలో ఉన్నా తాను వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇస్తూ పార్టీ అభివృద్ధి కోసం అందరూ సమష్టిగా పని చేయాలని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ అధ్వర్యంలో ఆదివారం జరిగిన మండల స్థాయి పార్టీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు సంక్షేమాలు పి-4 పథ కం ద్వారా అమలు చేస్తున్నాం..18 సంవత్సరాలు నిండిన మహిళలకు దీని ద్వారా ఏడాదికి రూ.18 వేలు అందాయని చెబుతున్నారని, పి-4 పథకం అంటే ఏమిటని ప్రజలు అడిగితే తనకే తెలీదంటున్నారని ఎద్దేవా చేశారు. చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా ఆదివారం ఇక్కడకు వచ్చిన అమర్‌నాథ్‌కు పార్టీ శ్రేణులు భారీ బైకు ర్యాలీతో స్వాగతం పలికారు. మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హోంమంత్రి అనిత ఇలాకా పాయకరావుపేట తదితర ప్రాంతాల్లో కల్తీమందు అమ్మకాలు జరుగుతుంటే దీనికి రింగుమాస్టర్ అయిన స్పీకర్ అయ్యన్న పాత్రుడిని ఏమనాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని, ఎన్ని దాడులు, కేసులూ ఉన్నా మన పార్టీ నాయకులు తగ్గేదేలే అంటూ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రశ్నించడం గర్వించతగ్గ విషయం అన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను మండల పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, బీసీ కార్పోరేషన్ మాజీ స్టేట్ డైరెక్టర్ రమణ, సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, సత్యంనాయుడు, హరిబాబు, పోతల రాజశేఖర్, చెట్టుపల్లి వెంకట్రావు, మద్దు అప్పలనాయుడు, చిటికెల వెంకటసత్తిబాబు, దోసపత్నిరాజు, సర్పంచ్‌లు వెంకటరమణ, గుము లూరి సన్యాసినాయుడు, ఎంపీటీసీలు వడ్డాది సతీష్, వెంకటరాజారావు, కృష్ణంనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



దేవరాపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



కె.జె.పురం జంక్షన్‌లో ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి



మాకవరపాలెంలో తులసిదళ పూజలు

మాడుగుల రూరల్ : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా రామాలయాలు, వైష్ణవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కె.జె.పురం రామాలయంలో ఆదివారం ఉదయం 5 గంటలకు ఏకాహం ప్రారంభించారు. భక్తులు తమ భక్తి పాటలతో సాయంత్రం వరకు భజన కార్యక్రమం నిర్వహించారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

కె.కోటపాడు : ఆషాఢ మాస తొలి ఏకాదశి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో గల ప్రధాన ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలను జరిపారు. శ్రీ మహావిష్ణువు క్షీరాబ్ధి యందు శయనించే శయన ఏకాదశి పర్వదినం కావడంతో భక్తుల పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి. మేడిచర్లలో కేశవస్వామి ఆలయంతో పాటు కె.కోటపాడులో గల రామాలయంలో భక్తులు పూజలు జరిపారు.

దేవరాపల్లి: మండలంలోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పురోహితుడు గిరి నాగేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి.

నాతవరం : తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు , అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మండలంలో వెదురుపల్లి, తాండవ, మర్రిపాలెం గ్రామాల్లో గల వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. నాతవరం శ్రీశక్తిపంచాయతన ఆలయం, సిద్ధిపట్నం దుర్గామల్లేశ్వరిదేవి, వీబీఅగ్రహారంలో పూజలు చేశారు.

మాకవరపాలెం : తొలి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకృష్ణ వీధిలో కృష్ణుడి ఆలయం వద్ద ఆదివారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తులసిదళ పూజలు నిర్వహించారు. 200 మహిళలు పాల్గొన్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. తామరం వేంకటేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. నిర్వాహకులు రత్నమాల, రఘుబాబు, నాని పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

దేవరాపల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటీయూ జిల్లా సీనియర్ నాయుకుడు గండి నాయన్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సిఐటీయూ మండల నాయకులు రొంగలి దేముడునాయుడు, బి.టి.దొర, నాగిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. దేవరాపల్లి, కాశీపురం, మారేపల్లి, తెనుగుపూడి, వెంకటరాజుపురం, వాకపల్లి తదితర గ్రామాల్లో ఆటో ప్రచార జాత నిర్వహించారు.

కె.కోటపాడు : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రతిఘటించాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివారం చౌడువాడ, గుల్లేపల్లి తదితర గ్రామాల్లో ఆటోపై ప్రచారం జరిపారు. కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం మేలు చేసేలా నిర్ణయాలను తీసుకుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరసన తెలుపుతూ చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక, కర్షక, అసంఘటిత రంగంలో పని చేస్తున్న వారంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు యర్రా దేముడు, రొంగలి ముత్యాలనాయుడు, నాయుడుబాబు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులు



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

నర్సీపట్నం : మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల మేరకు పట్టణ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. పెదబొడ్డేపల్లి రోడ్డు వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ సీనియర్ నాయకులు పెట్ల అప్పలనాయుడు, వైస్ఎంపీపీ పైల సునీల్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు చీటిల రాము, సుధీర్, కణితి వాసు, అడిగర్ల నాయుడు, కిరణ్ పాల్గొన్నారు. అలాగే బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బి.ఎల్. స్వామి, కార్యదర్శి అధికారి చిన్నబ్బాయి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జగన్నాథ రథోత్సవాలు



ఇంద్రద్యుమ్నం వద్ద స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ రాజారామ్, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి

మాడుగుల: ఈ నెల 28 నుంచి ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. స్థానిక ఇంద్రద్యుమ్నం వద్ద దశావతారాలు పూర్తి చేసుకుని తిరిగి ఆదివారం మలివిడత రథోత్సవాల్లో భాగంగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రజ్యుహ్నం వద్ద దాతల సహాయంతో అన్న సమారాధన జరిపారు. స్వామి వారి రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. మలివిడత రథోత్సవంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పరామర్శ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న ఎంపీ దంపతులు



గణేష్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

నర్సీపట్నం : సీజనల్ వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను అరకు పార్లమెంట్ సభ్యులు జి.తనుజా రాణి, భర్త వినయ్, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అనకాపల్లి జిల్లా పార్టీ పరిశీలకులు శోభా హైమావతి, ఏఎస్ఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు ఆదివారం పరామర్శించారు. ఆరు రోజులుగా విష జ్వరంతో బాధపడుతున్న గణేష్ విశాఖ మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో గణేష్‌ను పరామర్శి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరి



కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి గాయత్రీదేవి

దేవరాపల్లి : పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి జి.గాయిత్రీదేవి సూచించారు. ప్రపంచ జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరాపల్లి పశువైద్యశాలలో 15 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు వేశారు. జంతువుల నుంచి పశువులకు, పశువుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులను జ్యూనోటిక్ వ్యాధులు అంటారన్నారు. రేబిస్, బ్రూసెల్ల, టీబీ, స్వైన్‌ఫ్లూ, తదితర జ్యూనోటిక్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలో ఆదివారం జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో అన్ని రైతు సేవాకేంద్రాల్లో 161 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసారు. ఏడీ చిట్టినాయుడు మాట్లాడుతూ పశువుల నుంచి సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. ఈనెల 7 వ తేదీ నుండి14 వ తేదీ వరకు మాడుగుల, చీడికాడ మండలాల్లో రైతు సేవా కేంద్రాలులో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

మాకవరపాలెం : జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రం వద్ద కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. వివిధ గ్రామాలకు చెందిన 60 మంది తమ పెంపుడు కుక్కలను తీసుకువచ్చి వ్యాక్సిన్‌లు వేయించారని పశువైద్యాధికారి మణిదీప్ తెలిపారు.

చీడికాడ: పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మెలగాలిని పశుసంవర్ధక సహాయకులు ఎం.శ్రీనివాసరావు అన్నారు.ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇస్తే రేబిస్ వంటి సంక్రమిత వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు.అలాగే పెంపుడు జంతువుల విషయం తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నర్సీపట్నం : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ప్రత్యేక టీకాల శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు, వార్డు కౌన్సిలర్ పద్మావతి ప్రారంభించారు. శిబిరంలో 115 పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. శిబిరంలో వైద్యులు దుర్గాప్రసాద్, నరేష్, పుష్ప, శిరీష, యమున, పశువైద్య సహాయకులు అలివేణి, భవాని, శ్రీరామ్మూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ ఉదయ, గోపాలమిత్రలు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.